సాక్షి
ములుగు
ఆదివారం । 18 । మే । 2025



హోరాహోరీగా నెట్‌బాల్ పోటీలు

జనగామ జిల్లా కేంద్రంలోని బతుకమ్మకుంటలో నెట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి.

- 8లో▸



లోకోపైలెట్ల గైర్హాజరుతో రైళ్లు రద్దు

కాజీపేట జంక్షన్ కేంద్రంగా ప్రయాణిస్తున్న పలు రైళ్లు లోకోపైలెట్ల గైర్హాజరుతో రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
35.7^0 / 26.4^0

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు వడగాలులు వీస్తాయి. సాయంత్రం పలుచోట్ల ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

జీఓ నంబర్ 3ను పునరుద్ధరించాలి



పూనెం ప్రతాప్

వాజేడు: జీఓ నంబర్-3ను పునరుద్ధరించాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీలోని ఆదివాసీ యువతకు ఉపయోగపడే జీఓను 2020లో రద్దు చేస్తూ సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఆదివాసీ బిడ్డలకు అన్యాయం జరుగుతుందని తెలిసినా.. గత ప్రభుత్వం ఒక్క రివ్యూ పిటిషన్ వేయకపోవడం దారుణమన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఆదివాసీ సమాజం పక్షాన రివ్యూ పిటిషన్ వేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే జీఓ పునరుద్ధరణ కోసం ఆదివాసీ సంఘాలు ఐక్యంగా ప్రభుత్వంపై ఆందోళనల రూపంలో ఒత్తిడి తీసుకొచ్చేలా భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామన్నారు. దీనిలో భాగంగా.. మే 31న భద్రాచలం ఐటీడీఏను ముట్టడిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిరుద్యోగ యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

108లో ప్రసవం



వాజేడు: మండల పరిధి బొల్లారం గ్రామానికి చెందిన సీహెచ్.రమాదేవి 108 అంబులెన్స్‌లో శనివారం ఉదయం బిడ్డకు జన్మనిచ్చింది. బొల్లారం గ్రామానికి చెందిన రమాదేవికి పురిటినొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌లో వెంకటాపురం(కె)కు తరలించారు. మొదటి కాన్పు కావడంతో ప్రసవం ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందని వైద్యుల సూచన మేరకు ఏటూరు నాగారం ప్రభుత్వ వైద్యశాలకు రెఫర్ చేశారు. ఈఎంటీ రాజ్యలక్ష్మి, పైలెట్ కుమారస్వామి 108 అంబులెన్స్‌లో తీసుకెళ్తుండగా.. ఏటూరునాగారం సమీపంలో రమాదేవి ప్రసవించింది. ప్రస్తుతం తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



ప్రశాంత్(ఫైల్)

వెంకటాపురం(కె): మండల పరిధి బీసీ మర్రిగూడెం గ్రామానికి చెందిన బొల్లె ప్రశాంత్(29) శనివారం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరుబయట నిద్రించేందుకు ఫ్యాన్ వైర్లను స్విచ్ బోర్డులో పెడుతున్న సమయంలో ప్రశాంత్‌కు విద్యుత్ షాక్ తగిలింది. బంధువులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. వైద్యం అందిస్తుండగా అతడు మృతి చెందాడు. పోలీసులు వివరాలు సేకరించారు.

మూడో రోజు అన్నదానం



భూపాలపల్లి రూరల్: సరస్వతి పుష్కరాల సందర్భంగా కాళేశ్వరం వచ్చే భక్తులకు భూపాలపల్లి మండలం కమలాపూర్ క్రాస్ వద్ద జాతీయ రహదారి పక్కన భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణరావు ఆధ్వర్యంలో మూడోరోజు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే భక్తులకు భోజనం వడ్డించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు భోజనం చేశారు. కార్యక్రమంలో కమలాపూర్ మాజీ సర్పంచ్ తోట సంతోశ్, భూపాలపల్లి మాజీ కౌన్సిలర్ సిరుప అనిల్, అప్పం కిషన్, తోట రంజిత్, మహేందర్, చరణ్, కోటి, హఫీజ్, సాయితేజ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో 10వేల మంది తరలింపు



భూపాలపల్లి అర్బన్: సరస్వతి పుష్కరాల్లో భాగంగా మూడో రోజు శనివారం వివిధ ప్రాంతాల నుంచి కాళేశ్వరానికి 183 ఆర్టీసీ బస్సుల్లో 10,500 మందిని తరలించినట్లు అధికారులు తెలిపారు. కాళేశ్వరం నుంచి సాయంత్రం 6గంటలకు 170 బస్సుల్లో 7,500 మంది తిరిగి వెళ్లినట్లు తెలిపారు.



దీపం వెలిగించిన యువతి, గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిని సరస్వతి నదిలో పుష్కరస్నానాలు ఆచరిస్తున్న భక్తులు,



కాళేశ్వరాలయంలో కిక్కిరిసిన క్యూలైన్లు



తీపిజ్ఞాపకం: ఎడ్లబండిపై వెళ్తూ సెల్ఫీ తీసుకుంటున్న యువతి

పుష్కర సంబురం

సరస్వతి నదిలో మూడోరోజు లక్షన్నర మంది స్నానాలు

- పిండ ప్రదానాలు, పితృ దేవతలకు తర్పనాలు
- భక్తులతో కిటకిటలాడిన కాళేశ్వరాలయ క్యూలైన్లు
- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్, తుని తపోవనం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతిస్వామి పూజలు
- వర్షంతో బురదగా మారిన పార్కింగ్ స్థలాలు..

సరస్వతయే నమః
పుష్కరాలు - 2025

త్రివేణి సంగమం.. జన సంద్రమైంది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు నదీమ తల్లికి నీరాజనం పలికారు. పుష్కర స్నానమాచరించి పునీతులయ్యారు. పిండ ప్రదానాలు చేసి పితృదేవతలకు తర్పనాలు వదిలారు. గోదావరి మాతకు దీపాలు సమర్పించారు. హారతి ఇచ్చి అండగా నిలవమంటూ మొక్కులు చెల్లించుకున్నారు. హర హర మహదేవ అంటూ ముక్తీశ్వరుడిని దర్శించుకున్నారు. శనివారం లక్షన్నర మంది భక్తులు పుష్కర స్నానాలు ఆచరించినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, పీఠాధిపతులు ప్రత్యేక పూజలు చేశారు.

- భూపాలపల్లి/కాళేశ్వరం

- వివరాలు 8లో▸



నదికి నవరత్నమాల హారతి ఇస్తున్న కాశీ పండితులు

మహిళలకు ఉపాధి

యూనిఫాం తయారీలో 154 మంది

- గిరిజన విద్యార్థులకు ఒక్కో డ్రెస్‌కు రూ.100 చెల్లింపు
- సెర్ప్‌కు నిర్వహణ బాధ్యతలు



డ్రెస్ కుడుతున్న మహిళ.. పరిశీలిస్తున్న సెర్ప్ సీసీలు

ఏటూరునాగారం: యూనిఫాంల తయారీతో మహిళలు ఉపాధి పొందుతున్నారు. గతంలో ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల యూనిఫాంలను టెండర్ల ద్వారా ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చి డబ్బును అప్పనంగా అప్పగించేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఆలోచనతో సెర్ప్ ద్వారా స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులను భాగస్వాముల్ని చేస్తోంది. దీంతో మండలాల వారీగా టైలరింగ్‌లో ప్రతిభ కలిగి, ఆసక్తి ఉన్న మహిళలను గ్రామైక్య సంఘాల ద్వారా ఎంపిక చేసి ఆ మండలంలో ఉన్న గిరిజన విద్యా సంస్థల విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మహిళలను ఎంపిక చేశారు. బాలికల దుస్తులు కుట్టే మహిళలకు బాలికల మెటిరీయల్, బాలుర దుస్తులు కుట్టే మహిళలకు మెటిరీయల్‌ను ఐటీడీఏ ద్వారా కొలతల ప్రకారం అందజేశారు. ఈమేరకు మహిళలు దుస్తులను తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు.

ఒక్కో డ్రెస్‌కు రూ.100

బాలిక, బాలురు ఒక్కో డ్రెస్‌కు రూ.100ల చొప్పున ఎన్ని డ్రెస్‌లు మహిళా కుడితే ఆ మహిళ ఉన్న గ్రామైక్య సంఘంలో నగదును జమ చేస్తారు. సంఘంలోని మహిళలు తీర్మానం చేసి దుస్తులు కుట్టిన మహిళలకు నగదు ఇవ్వడంతో ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు దోహదపడుతుంది.

ఈనెల 20 వరకు టార్గెట్..

ఈ విద్యా సంవత్సరం జూన్ 12న ప్రారంభం కానుంది. ఆలోపు ఆశ్రమ పాఠశాలల వారీగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఒక్కో విద్యార్థికి రెండు జతల దుస్తులను తయారు చేసి స్కూల్ పునః ప్రారంభంలోపు పాఠశాలల యాజమాన్యాలకు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. విద్యాశాఖ, ఐటీడీఏ ట్రైబల్ వెల్ఫేర్, సెర్ప్ సంయుక్తంగా ఈ దుస్తుల తయారీని పర్యవేక్షిస్తున్నారు. దీంతో తాము ఆర్థికంగా ఎదిగేందుకు ఈ పని ఎంతగానో దోహదపడుతోందని మహిళా సంఘాల సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



విద్యార్థులకు యూనిఫాం కుడుతున్న మహిళా సంఘాల సభ్యులు

44 పాఠశాలలు.. 6,886 మంది విద్యార్థులు

జిల్లాలోని 20 బాలికల ఆశ్రమ పాఠశాలల్లో 3,559 మందికి 7,061 డ్రెస్ కుట్టడం వల్ల మహిళా సంఘాల సభ్యులకు రూ. 7.6 లక్షల ఆదాయం వస్తోంది. అదేవిధంగా జిల్లాలో 24 బాలుర ఆశ్రమ పాఠశాలల్లో 3,327 మందికి విద్యార్థులకు 6,654 డ్రెస్‌లను కుట్టడం వల్ల 154 మంది మహిళలకు రూ.6.6 లక్షల ఆదాయం రానుంది.

ఆర్థికంగా ఎదుగుతున్నాం..



ప్రభుత్వం అప్పగించిన పనిని సమర్థవంతంగా నిర్వహిస్తున్నాం. కష్టపడి పిల్లల డ్రెస్‌లను కుట్టడం వల్ల ఆర్థికంగా ఎదుగుతున్నాం. ఈవేసవిలో ఉపాధి లభించింది. దీంతో కుటుంబ అవసరాలను తీర్చుకుంటాం.

- మండలోజు విజయలక్ష్మి, స్వయం సహాయక సంఘం మహిళా సభ్యురాలు(టైలర్), లక్ష్మీపురం

రోగులకు నాణ్యమైన భోజనం అందించాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్
- ఏరియా ఆస్పత్రి పరిశీలన



భోజనాన్ని పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్

ములుగు: ఆరోగ్య సమస్యలతో వచ్చే రోగులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ సూచించారు. శనివారం వెంకటాపురం(ఎం) మండలం గుర్రంపేటకు చెందిన గర్భిణి ఝాన్సీ ఆరోగ్య పరిస్థితి తెలుసుకునేందుకు జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి వెళ్లారు. ఆ సమయంలో సదరు కాంట్రాక్టర్ తరఫున ఆస్పత్రి సిబ్బంది రోగులకు భోజనం వడ్డిస్తున్నారు. కూరలు నాణ్యతగా లేకపోవడంతో నిర్వాహకుడితో మాట్లాడి మరోసారి ఇలాంటి తప్పిదం జరిగితే విషయాన్ని మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్తానని హెచ్చరించారు. అనంతరం ఝాన్సీకి ఉమ్మ నీటి సమస్య ఉందని తెలుసుకుని డ్యూటీలో ఉన్న వైద్యురాలితో మాట్లాడారు. గతంలో బండారుపల్లికి చెందిన గర్భిణీ విషయంలో జరిగిన తప్పిదం కారణంగా ప్రభుత్వం, మంత్రి సీతక్క ఇబ్బందులు పడ్డారన్నారు. పేషెంట్లను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. ఓపీలో నిర్దిష్ట సమయం వరకు ప్రజలకు అందుబాటులో ఉండాలని వైద్యులను సూచించారు. ఆయన వెంట వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల భరత్, జక్కుల రేవంత్, పీఏసీఎస్ చైర్మన్ చిక్కుల రాములు తదితరులు ఉన్నారు.

టోల్ వసూళ్ల నిలిపివేత

కాటారం: కాళేశ్వరం వచ్చే వాహనాలకు గ్రామపంచాయతీ టెండర్ ద్వారా వసూలు చేస్తున్న టోల్ ఫీజును తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ శనివారం తెలిపారు. సరస్వతి పుష్కరాల నేపథ్యంలో శనివారం నుంచి భక్తుల వాహనాల రాక విపరీతంగా పెరిగిపోయింది. కాళేశ్వరం ప్రారంభంలోని ముక్తివనం వద్ద టెండర్‌దారులు వాహనాలను నిలిపి టోల్‌ఫీజు వసూలు చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పరిస్థితిని పరిశీలించిన కలెక్టర్ వాహనాలను నిలిపి టోల్‌ఫీజు వసూలు చేయవద్దని టెండర్‌దారులను ఆదేశించారు. టోల్‌ఫీజు చెల్లించవద్దని వాహనదారులకు సూచించారు. అటువైపుగా వచ్చే వాహనాలకు టెండర్‌దారులు టోల్‌వసూలు నిలిపివేశారు.

సర్టిఫికెట్ల ప్రదానం



సర్టిఫికెట్లు అందజేస్తున్న జీఎం రాజేశ్వర్‌రెడ్డి

భూపాలపల్లి అర్బన్: ఏరియాలోని సింగరేణి స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులకు శనివారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ఏరియా జీఎం రాజేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అందించారు. సోలార్ 24మంది, డ్రోన్ 29మంది శిక్షణ తీసుకున్నారు. వృత్తి శిక్షణ పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందించి జీఎం మాట్లాడారు. నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపయోగపడుతుందన్నారు. భవిష్యత్‌కు బాటలువేసేలా ఉంటుందన్నారు. స్వయంగా ఉపాధి పొందే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు.

నిబంధనల ప్రకారమే సేవలందించాలి

- ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్
- మీ సేవ కేంద్రాల్లో ఆకస్మికంగా తనిఖీలు

ఏటూరునాగారం: మంగపేట, ఏటూరునాగారం, వెంకటాపురం(కె) మండలాల్లోని మీసేవ కేంద్రాలను జిల్లా అధికారులు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కంప్యూటర్లను పరిశీలించారు. అనంతరం ఈ - డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ మాట్లాడుతూ.. త్వరలోనే మీసేవ కేంద్రాల్లో కొత్తగా ఇన్సూరెన్స్, కొరియర్ సర్వీసులు అందుబాటులోకి వస్తాయన్నారు. మండలాలవారీగా ఆధార్ నమోదు కేంద్రాల సంఖ్యను పెంచనున్నట్లు తెలిపారు. సేవలకు అధిక రుసుము వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ధరల పట్టికను అందరూ మీసేవ కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని, మీసేవ అంటే ఒక బ్రాండ్ అని దాన్ని చెడగొట్టేలా ఎవరూ వ్యవహరించవద్దన్నారు. కొంత మంది నిర్వాహకులు ఫిక్స్‌డ్ రేటు కంటే ఎక్కువ రుసుము వసూలు చేస్తున్నారని.. తమ దృష్టికి వస్తే ఆ మీసేవ సెంటర్‌పై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతీ మీసేవ సెంటర్లో మీసేవ సర్వీసుల ధర పట్టిక, ఫిర్యాదు సెంటర్ నంబర్ 1100, ఈడీఎం, తహసీల్దార్ మొబైల్ సెంటర్‌లో తప్పకుండా ప్రదర్శించాలన్నారు. ఆధార్ సెంటర్‌ను తప్పకుండా ప్రభుత్వ కార్యాలయం పరిధిలోనే నడపాలన్నారు. కార్యక్రమంలో టీజీటీఎస్ మేనేజర్ విజయ్, టీజీ ఆన్‌లైన్ మేనేజర్ రాకేశ్ పాల్గొన్నారు.

ముగిసిన హేమాచలుడి బ్రహ్మోత్సవాలు



ఆలయ ప్రాంగణంలో గజ వాహనంపై ఉత్సవమూర్తులకు వసంతోత్సవం నిర్వహిస్తున్న పూజారులు



గజ వాహనంపై దేవతా మూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

మంగపేట: రెండో యాదగిరిగుట్టగా ప్రసిద్ధిగాంచిన మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శనివారం బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఈనెల 8 నుంచి ప్రారంభమైన లక్ష్మీనృసింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్ల బ్రహ్మోత్సవాలు (జాతర) గత పది రోజులపాటు అత్యంత వైభవంగా కొనసాగాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రావణం సత్యనారాయణ ఆధ్వర్యంలో భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానం ప్రధాన ఉప ప్రధానార్చకులు అమరవాది మురళీ కృష్ణమాచార్యుల బృందం పదిరోజులపాటు బ్రహ్మోత్సవాలను పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం అత్యంత వైభవంగా జరిపించారు. బ్రహ్మోత్సవాల చివరి రోజు నృసింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్ల ఉత్సవమూర్తులను నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక గజవాహన పల్లకీ సేవపై ఉంచి వసంతోత్సవం నిర్వహించారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు దేవతామూర్తులను ఆలయ ప్రాంగణంలోని యాగశాల నుంచి మంగళ వాయిద్యాల నడుమ ప్రత్యేక పల్లకిపై ఆలయ పురవీధుల్లో వసంతోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా యాగ్నిక పూజారులు సిబ్బంది ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ భక్తులపై రంగులను చిలకరిస్తూ ఆనందం నడుమ వసంతోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని రమాసమేత సత్యనారాయణస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతర చివరిరోజు భక్తులకు పలువురు దాతలు మహా అన్నదాన ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు శేఖర్ శర్మ, పవన్‌కుమార్ ఆచార్యులు, ఈశ్వర్ చందు శర్మ, ఆలయ సీనియర్ అసిస్టెంట్ సీతారాములు, రికార్డ్ అసిస్టెంట్ గోనె లక్ష్మీనారాయణ, సిబ్బంది శివరాజు శేషు, నూతల కంటి అజయ్, నవీన్, గొల్లపల్లి గణేశ్, బ్రహ్మోత్సవాల ఉత్సవ కమిటీ సభ్యులు సురేశ్, వేమ రవి, దామెర సారయ్య, చందర్లపాటి శ్రీనివాస్, అనిత ఉన్నారు.

తిరంగా యాత్రను విజయవంతం చేయాలి



ప్రజాసంఘాల నాయకులతో తిరంగా యాత్ర జిల్లా కన్వీనర్ భూక్య జవహర్‌లాల్

ములుగు రూరల్: దేశ రక్షణ కోసం అహర్నిశలు కష్టపడుతున్న సైనికులకు, విధి నిర్వహణలో వీరమరణం పొందిన సైనికుల గౌరవార్థం చేపడుతున్న తిరంగా యాత్రను విజయవంతం చేయాలని తిరంగ యాత్ర జిల్లా కన్వీనర్ భూక్య జవహర్‌లాల్ అన్నారు. ఈమేరకు శనివారం జిల్లా కేంద్రంలో ప్రజా సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 20న సాయంత్రం 5 గంటలకు జిల్లా కేంద్రంలోని తిరుమల థియేటర్ నుంచి జాతీయ రహదారిపై తిరంగ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశ సైనికులకు మద్దతుగా ఆపరేషన్ సిందూర్ వీర విజయాన్ని స్మరించుకుంటూ ర్యాలీ కొనసాగుతుందని, ర్యాలీలో విద్యార్థులు, కుల సంఘాలు, ఉద్యోగులు, పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సిరికొండ బలరాం, భాస్కర్‌రెడ్డి, పింగిళి నాగరాజు, దుబాషి రమేశ్, గోవింద్‌నాయక్, మధు, కుమార్, రాహుల్, రవీంద్రచారి, శ్రీను, రాజన్న, నాగరాజు, కృష్ణాకర్, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రామప్ప టెంపుల్ బ్యూటిఫుల్

వెంకటాపురం(ఎం): రామప్ప టెంపుల్ బ్యూటిఫుల్ అంటూ.. స్వీడన్ దేశానికి చెందిన ఓలా తాంగ్విండ్ కొనియాడారు. మండలంలోని చారిత్రాత్మక రామప్ప దేవాలయాన్ని శనివారం ఆయన సందర్శించి రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం అందించగా.. గైడ్ వెంకటేశ్ ఆలయ శిల్పాకళా సంపద గురించి వివరించారు. రామప్ప శిల్పాకళాసంపద బాగుందని ఆయన కొనియాడారు.



స్వీడన్ దేశస్తుడికి ఆలయ విశిష్టతను వివరిస్తున్న గైడ్ వెంకటేశ్

రైల్వే లోకోపైలెట్ల గైర్హాజరుతో పది రైళ్లు రద్దు



కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ కేంద్రంగా ప్రయాణిస్తున్న పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు, పుష్‌పుల్ ప్యాసింజర్ రైళ్లను లోకోపైలెట్ల గైర్హాజరుతో రద్దు చేసినట్లు రైల్వే అధికారులు శనివారం తెలిపారు. లోకో పైలెట్లు డిపార్ట్‌మెంటల్ పరీక్షలు రాస్తున్నందున ప్యాసింజర్ రైళ్లను నడిపించే వారి కొరత ఏర్పడిందని, దాంతో పలు ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లను సికింద్రాబాద్ అధికారులు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. కాగా, పలు రైళ్ల రద్దుతో పాటు వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీ వ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పుష్ పుల్ ప్యాసింజర్ రైళ్ల రద్దు కావడంతో ఎక్స్‌ప్రెస్ రై ళ్లలో వెళ్లలేక సామాన్యులు ఇక్కట్లు పడుతున్నారు.

రద్దయిన ఎక్స్‌ప్రెస్ రైళ్లు

ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు కాజీపేట – బల్లార్షా (17035) వెళ్లే ఎక్స్‌ప్రెస్, ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు బల్లార్షా – కాజీపేట (17036) వెళ్లే ఎక్స్‌ప్రెస్, కాజీపేట – సిర్పూర్ కాగజ్‌నగర్ (17003) వెళ్లే ఎక్స్‌ప్రెస్, బల్లార్షా – కాజీపేట (17004) వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లు.

నిలిచిన పుష్‌పుల్ ట్రైన్స్

ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు సికింద్రాబాద్ – వరంగల్ (67761) వెళ్లే పుష్‌పుల్, వరంగల్ – సికింద్రాబాద్ (67762) పుష్‌పుల్, సికింద్రాబాద్ – కా జీపేట (67763) పుష్‌పుల్, కాజీపేట – సికింద్రాబాద్ (67764) పుష్‌పుల్, డోర్నకల్ – కాజీపేట (67766) పుష్‌పుల్, కాజీపేట డోర్నకల్ (67765) పుష్‌పుల్ రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు వివరించారు.

క్రైం ఏసీపీగా కిరణ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

రామన్నపేట: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వరంగల్ పోలీస్ కమిషనర్ క్రైం విభాగం నూతన ఏసీపీగా కిరణ్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్‌ను అధికారులు, సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

నీళ్లారగిస్తున్న మహిళ


స్నానమాచరిస్తున్న భక్తుడు


చిన్నారితో కలిసి స్నానం చేస్తున్న మహిళ


దీపారాధన చేస్తున్న మహిళలు


ఉత్సవ విగ్రహానికి జలాభిషేకం


పుణ్యస్నానం చేస్తున్న యువతులు


పుష్కరం.. పునీతం





ఆలయానికి వస్తున్న సచ్చిదానంద సరస్వతి స్వామి



అంతర్వాహినిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



కాళేశ్వరాలయంలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న వలంటీర్



సొమ్మసిల్లి పడిపోయిన భక్తుడు



పుష్కర ఘాట్‌కు స్నానమాచరించేందుకు వెళ్తున్న భక్తులు



పార్కింగ్ స్థలంలో నిలిపిన వాహనాలు



చిత్తడిగా మారిన ఘాట్ రోడ్డు



స్నానాలు చేస్తూ సెల్ఫీ దిగుతున్న భక్తులు

డిప్యూటీ సీఎం కాలసర్ప పూజలు



కాలసర్ప పూజలు చేస్తున్న భట్టి దంపతులు

కాటారం/కాళేశ్వరం: సరస్వతి పుష్కరాల్లో భాగంగా సరస్వతి ఘాట్ వద్ద రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తన సోదరుడు మల్లు ప్రసాద్‌తో కలిసి శనివారం తమ పితృదేవతలకు పిండప్రదానం చేశారు. అనంతరం పుష్కర స్నానం ఆచరించి కాళేశ్వర ముక్తీశ్వర ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా భట్టికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కుటుంబ సమేతంగా స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో కాలసర్ప నివారణ పూజలు, స్వామి వారికి క్షీరాభిషేకం చేశారు. ఆలయ పురోహితులు వేద మంత్రోచ్చరణల మధ్య డిప్యూటీ సీఎం దంపతులకు ఆశీర్వచనం చేసి స్వామి వారి ప్రసాదం అందజేశారు.

హోరాహోరీగా నెట్‌బాల్ పోటీలు



ట్రెడిషనల్ ఫైనల్‌లో నారాయణపేట (విన్నర్), కరీంగనర్ (రన్నర్) జట్లు

జనగామ: జనగామ జిల్లా కేంద్రంలోని బతుకమ్మ కుంటలో రాష్ట్రస్థాయి 8వ సబ్ జూనియర్ అండర్ -16 నెట్‌బాల్ చాంపియన్ షిప్ -2025 పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. రాష్ట్రంలోని 25 జిల్లాల నుంచి 620 మంది బాలబాలికలు హాజరయ్యారు. ట్రెడిషనల్, ఫాస్ట్ -5, మిక్స్‌డ్ నెట్‌బాల్ పోటీల్లో మూడు కేటగిరీల వారీగా క్రీడాకారులు తలపడుతున్నారు. ఇందులో ట్రెడిషనల్, ఫాస్ట్ -5 రెండు కేటగిరీలకు సంబంధించి బాలుర, బాలికల లీగ్, క్వార్టర్, సెమీ, ఫైనల్ మ్యాచ్‌లు ముగిశాయి. మిక్స్‌డ్ డబుల్ నెట్‌బాల్ పోటీలు శనివారం సాయంత్రం ప్రారంభమయ్యాయి.

రెండు కేటగిరీల్లో నారాయణపేట, మేడ్చల్ హవా

ట్రెడిషనల్, ఫాస్ట్ -5 నెట్‌బాల్ పోటీల్లో బాలుర, బాలికల విభాగంలో నారాయణపేట, మేడ్చల్ జిల్లాల హవా కొనసాగింది. ట్రెడిషనల్ నెట్‌బాల్ బాలుర 8వ పోటీల్లో నారాయణపేట (విన్నర్), కరీంనగర్ (రన్నర్), హైదరాబాద్, ఖమ్మం (థర్డ్/సంయుక్తంగా), బాలికల విభాగంలో మేడ్చల్ (విన్నర్), నల్లగొండ (రన్నర్), జనగామ, ఖమ్మం (థర్డ్ /సంయుక్తంగా) విజయకేతనం ఎగుర వేశాయి. ఫాస్ట్ -5 నెట్‌బాల్ బాలుర 4వ పోటీల్లో నారాయణపేట (విన్నర్), ఖమ్మం (రన్నర్), మహబూబ్‌నగర్, కొమురం భీం ఆసిఫాబాద్ (థర్డ్ /సంయుక్తంగా), బాలికల విభాగంలో మేడ్చల్ (విన్నర్), ఖమ్మం (రన్నర్), జనగామ, కొమురంభీం ఆసిఫాబాద్ (థర్డ్/సంయుక్తంగా) బరిలో దిగి గెలుపొందాయి. మిక్స్‌డ్ డబుల్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగియనున్నాయి. ముగింపు వేడుకల్లో బహుమతులు ప్రదానం చేయనున్నారు.



ఫాస్ట్ -5 ఫైనల్‌లో గెలుపొందిన మేడ్చల్ బాలికల టీం

పితృ దేవతలకు పిండ ప్రదానాలు

- సరస్వతి నది పుష్కరాల్లో సమర్పణ
- పుష్కరాల్లో పెద్దలకు సమర్పిస్తే మోక్షం
- వారి ఆత్మలు శాంతిస్తాయని భక్తుల నమ్మకం



గోదావరి నది తీరంలో పితృ దేవతలకు పిండ ప్రదానం చేస్తున్న భక్తులు

కాటారం: కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతి పుష్కరాల్లో భక్తులు పుష్కర స్నానం, ప్రత్యేక పూజలతో పాటు పిండ ప్రదానాలు, పితృ తర్పణాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. పన్నెండేళ్లకు ఒకసారి ఒక్కో నదికి వచ్చే పుష్కరంలో పితృదేవతలకు సమర్పణ ఆనవాయితీగా వస్తోంది. ఒక్కో రాశి బృహస్పతి (గురువు)లో ప్రవేశించడంతో ఒక్కో నదికి ఒక్కో ఏడాది పుష్కరం వస్తుంది. ఇలా 12 నదులకు 12 ఏళ్లకు ఒకసారి పుష్కరాలు వస్తుంటాయి. ఈ పుష్కరాల్లో స్నానం ఆచరిస్తే సకల రోగపీడలు తొలగిపోతాయని భక్తులు విశ్వసిస్తారు. అంతేకాకుండా, తమ కుటుంబంలో కాలం చేసిన పితృదేవతలకు పిండ ప్రదానాలు, పితృ తర్పణాలు సమర్పిస్తే వారి ఆత్మకు శాంతి కలిగి మోక్షం చేకూరుతుందని భక్తులు నమ్ముతారు. ఈ ఏడాది మిథున రాశి బృహస్పతిలో ప్రవేశించడంతో కాళేశ్వరంలో అంతర్వాహినిగా కొనసాగుతున్న సరస్వతి నదికి పుష్కరాలు వచ్చాయి. పన్నెండు రోజుల పాటు కొనసాగనున్న పుష్కర వేడుకలకు తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌తో పాటు పలు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. త్రివేణి సంగమంలో పుష్కర స్నానం ఆచరించడంతో పాటు పురోహితుల సమక్షంలో పితృదేవతలకు పిండ ప్రదానాలు, పితృ తర్పణాలు చేసి నదిలో సంకల్పాలు చేస్తున్నారు. ప్రతీ పుష్కరంలో నది తీరాన ముప్పై మూడు కోట్ల దేవతలతో పాటు పితృదేవతలు మచ్ఛ రూపంలో కొలువై ఉంటారని పురోహితులు, వేద బ్రహ్మణులు చెబుతున్నారు. ప్రతీ నది పుష్కరంలో పితృదేవతలకు పిండ ప్రదానాలు, పితృ తర్పణాలు చేయడం వల్ల వారికి మోక్షం కలుగుతుందని పేర్కొంటున్నారు.

పితృ దేవతలను స్మరించుకుంటూ..



గతంలో జరిగిన గోదావరి, ప్రాణహిత పుష్కరాల్లో పాల్గొని మా పితృదేవతలను స్మరించుకుంటూ పిండ ప్రదానం, సంకల్పం చేశాను. ఇప్పుడు కూడా మా పెద్దలకు పిండ ప్రదానం గావించాను. పురోహితుడి ఆధ్వర్యంలో మా పెద్ద పేరు మీదుగా సమర్పణ కార్యక్రమం జరిపించాను.

– బీరాసింగ్, నిజామాబాద్

పెద్దల ఆశీస్సులు ఉండాలని..



స్వర్గస్తులైన మా పితృ దేవతల ఆశీస్సులు మా కుటుంబ సభ్యులపై ఎళ్లవేళలా ఉండాలని వారికి పిండ ప్రదాన కార్యక్రమం జరిపించాను. వారు మా మధ్య లేకపోవడంతో బాధాకరం. అయినప్పటికీ వారిని స్మరించుకొని పిండప్రదానం చేయడం వల్ల కొంతమేర బాధ తొలగిపోయింది.

– సుధాకర్, హనుమకొండ

పితృ దేవతలకు స్వర్గలోక మోక్షం..



ఒక్కో రాశి ఒక్కో ఏడాది గురుడులోకి ప్రవేశిస్తుంది. దాంతో 12 నదులకు ఒక్కో ఏడాది పుష్కరం వస్తుంది. ఈ పుష్కరాల సమయంలో కోట్లాది దేవతలతో పాటు పితృదేవతలు నదీతీరంలో ఉంటారు. కాలం చేసిన పితృదేవతలకు ఈ సమయంలో పిండ ప్రదానం, పితృ తర్పణాలు చేస్తే వారికి స్వర్గలోక మోక్షం కలుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. ఈక్రమంలో ప్రతీ పుష్కరంలో పితృదేవతల పేరిట పూజలు చేయడం శుభప్రదం.

– వెంకటశివయ్య, పురోహితుడు, శ్రీశైలం

ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించిన కలెక్టర్ రాహుల్, ఎస్పీ కిరణ్



బైక్‌పై వెళ్తున్న కలెక్టర్, ఎస్పీ

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో సరస్వతి నది పుష్కరాల సందర్భంగా మూడో రోజు కాళేశ్వరానికి భక్తుల రద్దీ పెరిగింది. శనివారం వివిధ ప్రాంతాల నుంచి వాహనాల్లో కాళేశ్వరం బయలుదేరగా మహదేవపూర్ – కాళేశ్వరం రహదారిలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈక్రమంలో వాహనాలను క్రమబద్ధీకరించేందుకు కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ బైక్‌పై తిరుగుతూ వాహనాలను పంపించి రూట్ క్లియర్ చేశారు. కాగా, శని, ఆది వారాల్లో భక్తుల రద్దీ తీవ్రంగా ఉంటుందని అంచనా వేసి యంత్రాంగాన్ని వారు అప్రమత్తం చేశారు.

ప్రపంచంతో పోటీపడేలా ప్రభుత్వ పాలన

- సరస్వతి పుష్కరాల నిర్వహణ భేష్
- ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి తుమ్మల



పూజలు చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రఘురామిరెడ్డి, తదితరులు

కాటారం/కాళేశ్వరం: సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాష్ట్రం ప్రపంచంతో పోటీపడేలా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన కొనసాగిస్తోందని, ముక్తీశ్వర స్వామి ఆశీర్వాదం ఉంటే మరింత ముందుకు వెళ్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతి నది పుష్కరాల్లో భాగంగా ఉప ముఖ్యమంత్రి, మంత్రి, ఖమ్మం ఎంపీ రఘురామిరెడ్డి వేర్వేగా శనివారం పుష్కర స్నానం అచరించి సరస్వతి అమ్మవారు, కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి తుమ్మల వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా పుష్కరాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పన్నెండేళ్లకు ఒకసారి వచ్చే పుష్కరాలు ఎంతో పవిత్రమైనవని, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పుష్కర స్నానాలు ఆచరించాలని సూచించారు. రాష్ట్రంలో గోదావరి పుష్కరాలు భారీగా నిర్వహించడానికి ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ రావు, మక్కాన్‌సింగ్, కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే, అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, భూపాలపల్లి ఆర్డీఓ రవి, దేవాదాయశాఖ ఆర్జేసి రామకృష్ణారావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో వర్ష బీభత్సం



గాలిదుమారానికి కూలిన టెంట్

భూపాలపల్లి/కాళేశ్వరం: సరస్వతి పుష్కరాలకు లక్షలాది మంది భక్తులు వస్తున్న సమయంలో అకాల వర్షం బీభత్సం సృష్టించింది. కాళేశ్వరంలో శుక్రవారం రాత్రి భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో త్రివేణి సంగమం పుష్కర ఘాట్ తీరాన ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు నేలకూలాయి. పలుగుల బైపాస్ రోడ్, బస్టాండ్, వీఐపీ ఘాట్ రోడ్, టెంట్ సిటీ, సరస్వతి మాత విగ్రహం వెనుక, సాధారణ ఘాట్ వద్ద గల భారీ హోర్డింగ్‌లు, ఫ్లెక్సీ కటౌట్‌లు కూలిపోయాయి. రాత్రివేళ ఈదురుగాలులు వీయడంతో ఎటువంటి ప్రమాదమూ వాటిల్లలేదు. 120 ఎకరాల్లో ఉన్న పార్కింగ్ స్థలాలు రేగడి భూముల్లో ఉండటంతో వాహనాలను శుక్రవారం ఉదయం వరకు బయటకు తీయలేని పరిస్థితి నెలకొంది. వర్ష బీభత్సం జరిగిన వెంటనే రాత్రి కలెక్టర్ రాహుల్ శర్మ పలు ప్రాంతాలను సందర్శించారు. శనివారం ఉదయం వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ, మరమ్మతు పనులు చేపట్టారు.

ఎడ్ల బండ్లకు పెరిగిన గిరాకీ



పుష్కర స్నానం చేసి ఎడ్ల బండ్లపై వెళ్తున్న భక్తులు

భూపాలపల్లి అర్బన్: కాళేశ్వరం పుష్కరాల్లో భాగంగా సరస్వతి ఘాట్ వద్ద ఎడ్ల బండ్లకు గిరాకీ పెరిగింది. శుక్రవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా రోడ్లన్నీ బురదమయంగా మారాయి. దాంతో బురద రోడ్లపై వాహనాలు ముందుకు సాగక భక్తులు ఇబ్బందులు పడ్డారు. కార్లు, వాహనాలను దూరంగా పార్కింగ్ చేసి కాలినడకన వెళ్లలేక ఎడ్ల బండ్లను ఆశ్రయించారు. ఎడ్లబండ్ల యజమానులు ఒక్కరికి రూ.50 చొప్పున చార్జీ వసూలు చేస్తున్నారు. పట్టణాల నుంచి వచ్చిన భక్తులు ఎడ్ల బండ్లపై ప్రయాణం చేస్తూ సంబురపడుతూ, సెల్ఫీలు తీసుకుంటున్నారు.

నేటి నుంచి జాయ్‌రైడ్స్



కన్నెపల్లి వద్ద జాయ్‌రైడ్స్‌కు సిద్ధంగా ఉన్న హెలికాప్టర్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో జాయ్‌రైడ్స్‌కు ఆదివారం నుంచి హెలికాప్టర్ చక్కర్లు కొట్టనుంది. కన్నెపల్లిలోని లక్ష్మీ పంపుహౌస్ వద్ద భక్తులు విహంగ వీక్షణం చేయడానికి ఏవియేషన్ అధికారులు అందుబాటులోకి తీసుకువచ్చారు. యాత్రధామ్.ఓఆర్‌జీ యాప్‌లో ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలని, జాయ్‌రైడ్స్, టెంట్‌సిటీ, దేవస్థానం పూజలను ఈ యాప్‌లో పొందుపర్చినట్లు వివరించారు. జాయ్‌రైడ్స్ బుకింగ్ కోసం ఒక్కరికి రూ.4,500తో 6 – 7 నిమిషాల పాటు గాలిలో చక్కర్లు కొట్టనున్నారు. కన్నెపల్లి హెలిపాడ్ వద్ద హెలికాప్టర్ సిద్ధంగా ఉంది. టెంట్‌సిటీకి ఒక రోజుకు రూ.3వేల వరకు తీసుకుంటున్నట్లు ప్రతినిధులు పేర్కొన్నారు.

పోలీస్ వర్సెస్ ఎండోమెంట్

కాళేశ్వరం: సరస్వతి నది పుష్కరాల్లో రోజుకో ఘటన చోటుచేసుకుంటోంది. కాళేశ్వరం దేవస్థాన ఉపప్రధాన అర్చకుడు తన బంధువులను తోడ్కొని రాజగోపురం నుంచి ప్రధాన ఆలయంలోకి శనివారం వెళ్తుండగా పోలీసులు అడ్డుకొని అనుమతివ్వలేదు. దేవస్థాన అర్చకుడిని అని చెప్పినా పోలీసులు వినలేదు. భక్తుల ఎదుట తమపైకి ఓ ఎస్సై, ఏఎస్సై, ఓ కానిస్టేబుల్ వస్తూ వెకిలి చేష్టలు చేసి నాగిని నృత్యం చేస్తూ తొడకొట్టినట్లు ఆ అర్చకుడు వాపోయాడు. పోలీసుల కుటుంబాలను మాత్రం పదుల సంఖ్యలో లోపలికి అనుమతిస్తున్నారని, తమ బంధువులు వస్తే వెళ్లనివ్వరా అని ఆగ్రహం వ్యక్తం చేశాడు. అనంతరం డీఎస్పీ స్థాయి అధికారి అక్కడికి వచ్చి ఇరువురికి నచ్చజెప్పి గొడవను సద్దుమణిగించారు. కానిస్టేబుల్‌ను కూడా మందలించినట్లు సమాచారం. మూడు రోజులుగా పోలీసు, ఎండోమెంట్ శాఖల మధ్య ఘర్షణ జరుగుతోంది. ఆ రెండు శాఖల మధ్య సమన్వయం లోపించిందని భక్తులు అంటున్నారు. ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేసి పోలీసు, అధికారులను లోపలికి పంపిస్తే బాగుంటుందని ఓ అధికారి అభిప్రాయం వ్యక్తం చేశారు.